# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 25-04-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది ఈరోజు శ్రీనగర్‌లో భద్రతా సమీక్షా సమావేశం నిర్వహించారు.
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము.. పోప్ ఫ్రాన్సిస్ అంత్యక్రియలకు హాజరయ్యేందుకు రోమ్ నగరానికి చేరుకున్నారు.
- వివిధ రాష్ట్రాల్లో ఉంటున్న పాకిస్థాన్ జాతీయులను త్వరగా వెనక్కి పంపివేసేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు సూచించారు.
- వక్ఫ్ సవరణ చట్టం.. మతపరమైన ఆచారాలపై ఎటువంటి ప్రభావం చూపదని కేంద్ర ప్రభుత్వం సుప్రీం కోర్టుకు తెలిపింది.

=====================

జమ్ము కశ్మీర్‌లో భద్రతా పరిస్థితిని సమీక్షించడానికి ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది ఈరోజు శ్రీనగర్ చేరుకున్నారు. శ్రీనగర్‌లోని రాజ్ భవన్‌లో లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా… ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేదితో జరిగిన భద్రతా సమీక్ష సమావేశానికి అధ్యక్షత వహించారు. లెఫ్టినెంట్ జనరల్ MV సుచింద్ర కుమార్, లెఫ్టినెంట్ జనరల్ ప్రతీక్ శర్మ, లెఫ్టినెంట్ జనరల్ ప్రశాంత్ శ్రీవాస్తవ ఈ సమావేశంలో పాల్గొన్నారు. భారత భూభాగంలోని ఉగ్రవాదులపై దళాలు తీసుకుంటున్న చర్యలను నియంత్రణ రేఖ వెంబడి పాకిస్తాన్ సైన్యం కాల్పుల విరమణను ఉల్లంఘిస్తూ చేసిన ప్రయత్నాలను అధికారులు ఆర్మీ చీఫ్ జనరల్‌కు వివరించారు.

====================

వాటికన్ నగరంలో జరిగే పోప్ ఫ్రాన్సిస్ అధికారిక అంత్యక్రియలకు హాజరు అయ్యేందుకు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఇటలీలోని రోమ్ చేరుకున్నారు. రేపు జరిగే పోప్ ఫ్రాన్సిస్ అంత్యక్రియల ప్రార్థనలలో రాష్ట్రపతి పాల్గొంటారు. ఈ నెల 21వ తేదీన మరణించిన పోప్ ఫ్రాన్సిస్ అంత్యక్రియలకు ప్రపంచ వ్యాప్తంగా అనేక మంది ప్రముఖులు హాజరుకానున్నారు. రాష్ట్రపతి వెంట.. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు, మైనారిటీ వ్యవహారాల

సహాయ మంత్రి జార్జ్ కురియన్, గోవా శాసనసభ డిప్యూటీ స్పీకర్ జాషువా డి సౌజా ఉన్నారు. సెయింట్ పీటర్ బసిలికాలో రాష్ట్రపతి పోప్ ఫ్రాన్సిస్‌కు నివాళులర్పిస్తారని విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది.

=====================

వివిధ రాష్ట్రాల్లో ఉంటున్న పాకిస్థాన్ జాతీయులను వీలైనంత త్వరగా పంపివేసేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు సూచించారు. పహల్గామ్ ఉగ్రవాద దాడి నేపథ్యంలో పాకిస్తాన్ జాతీయులకు జారీ చేసిన వీసాలను రద్దు చేసిన తరువాత అమిత్ షా ఈరోజు వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులతోను మాట్లాడారు. ఆయా రాష్ట్రాల్లో ఉన్న పాకిస్తాన్ జాతీయులను గుర్తించాలని కోరారు.

=====================

వక్ఫ్ చట్టాన్ని దుర్వినియోగం చేయకుండా నిరోధించడానికి, ప్రభుత్వ ఆస్తుల ఆక్రమణకు దారితీసిన వక్ఫ్ చట్టం 1995కు సవరణలు తీసుకువచ్చామని కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ మేరకు సుప్రీం కోర్టులో దాఖలు చేసిన ప్రాథమిక అఫిడవిట్‌లో.. గత ప్రభుత్వ పాలనలో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులను కూడా వక్ఫ్ ఆస్తులుగా ప్రకటించారని పేర్కొంది. వక్ఫ్ ఆస్తుల నిర్వహణను పారదర్శకంగా, సమర్థవంతంగా, సమగ్రంగా మార్చే లక్ష్యంతో వక్ఫ్ సవరణ చట్టం 2025ను ఆమోదించినట్టు వివరించింది. దీనిలో ఆస్తుల నిర్వహణ, రికార్డ్ కీపింగ్, పాలనా నిర్మాణాలు వంటి వక్ఫ్ సంస్థల లౌకిక, పరిపాలనా అంశాలు మాత్రమే ఉద్దేశించబడ్డాయని, మతపరమైన ఆచారాలు, సిద్ధాంతాలపై ఎటువంటి ప్రభావం చూపవని స్పష్టం చేసింది.

=====================

భారతదేశం బలమైన ఆర్థిక వ్యవస్థ, మౌలిక సదుపాయాలతో వేగంగా అభివృద్ధి చెందుతోందని ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ పేర్కొన్నారు. ఈరోజు ఊటీలోని రాజ్ భవన్‌లో జరిగిన రెండు రోజుల వైస్ ఛాన్సలర్ల సమావేశంలో ఉపరాష్ట్రపతి పాల్గొని ప్రారంభోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా.. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి సైన్స్, పరిశోధన, నాయకత్వ పటిమ మనకు ఉన్న బలాలని అన్నారు. విశ్వవిద్యాలయాలు సంస్థల మధ్య జ్ఞానాన్ని పంచుకోవాలని.. ఉన్నత విద్య నాణ్యతను మెరుగుపరచాలని ఉప రాష్ట్రపతి ఆకాంక్షించారు. పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలకు ఉదారంగా నిధులు సమకూర్చాలని ఈ సందర్భంగా ఉప రాష్ట్రపతి పరిశ్రమలు, కార్పొరేషన్లు, వాణిజ్య సంస్థలకు విజ్ఞప్తి చేశారు.

(వాయిస్ 22 సెకన్లు)

=====================

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రేపు వివిధ ప్రభుత్వ విభాగాలు, సంస్థలలో కొత్తగా నియమితులైన యువతకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా 51 వేలకు పైగా నియామక పత్రాలను పంపిణీ చేయనున్నారు. ఉపాధి కల్పనకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలనే ప్రధానమంత్రి ఉద్దేశ్యానికి అనుగుణంగా, 15వ రోజ్‌గార్ మేళా దేశవ్యాప్తంగా 47 ప్రదేశాలలో జరుగుతుంది. ఇది యువత సాధికారతకు, జాతీయ అభివృద్ధికి అవకాశాలను కల్పిస్తుంది.

విరామం

=====================

క్వాంటమ్ కంప్యూటింగ్.. శాస్త్రీయ ఆవిష్కరణలను వేగవంతం చేస్తుందని కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా అన్నారు. ఈరోజు న్యూఢిల్లీలో 3వ అంతర్జాతీయ క్వాంటమ్ కమ్యూనికేషన్ కాన్‌క్లేవ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఒకప్పుడు అసాధ్యంగా భావించిన సమస్యలకు క్వాంటమ్

కంప్యూటింగ్.. బహుళ పరిష్కారాలను అందిస్తుందన్నారు. 3వ ఎడిషన్ జాతీయ క్వాంటం మిషన్‌కు కొత్త ఊపునిస్తుందని పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

=====================

శ్రీనగర్‌లో ఉన్న పర్యాటకుల కోసం రెండు ప్రత్యేక ఉచిత విమానాలను ఏర్పాటు చేశామని పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఈరోజు తెలిపింది. ఈ విమానాల ద్వారా 183 మంది ప్రయాణికులు నిన్న శ్రీనగర్ నుండి ముంబైకి చేరి, అనంతరం సురక్షితంగా తమ ఇళ్లకు తిరిగి చేరారని పేర్కొంది. 232 మందికి పైగా పౌరులను తీసుకువస్తున్న 3వ విమానం ఈరోజు ముంబై చేరుకుంటుందని వివరించింది. దాదాపు 500 మంది ఇప్పటికే సురక్షితంగా ఇంటికి చేరుకున్నారని మంత్రిత్వ శాఖ తెలియజేసింది.

=====================

ఇస్రో మాజీ ఛైర్మన్ డాక్టర్ కె. కస్తూరి రంగన్ ఈ ఉదయం బెంగళూరులోని తన నివాసంలో కన్నుమూశారు. 84 సంవత్సరాల కస్తూరి రంగన్.. భారత జాతీయ విద్యా విధాన కీలక రూపశిల్పిగాను పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (PSLV) అభివృద్ధిలోను  కీలక పాత్ర పోషించారు. 9 సంవత్సరాల పాటు భారత అంతరిక్ష కార్యక్రమాలకు నాయకత్వం వహించిన ఆయన 2003లో పదవీ విరమణ చేశారు. 2003 నుండి 2009 వరకు రాజ్యసభ సభ్యుడిగా సేవలందించారు. కాగా... కస్తూరి రంగన్ మృతి పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ సహా పలువురు ప్రముఖులు సంతాపం ప్రకటించారు.

=====================

అధిక నాణ్యత కలిగిన ఉక్కు ఉత్పత్తిదారుగా భారత్ సుస్థిరంగా కొనసాగుతోందని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పియూష్ గోయల్ అన్నారు. ముంబయిలో జరుగుతున్న స్టీల్ ఇండియా 2025 కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... డిమాండ్‌కు అనుగుణంగా భారత్ సమర్థవంతంగా ఉక్కును ఉత్పత్తి చేస్తోందన్నారు. యూరోపియన్ యూనియన్, యునైటెడ్ కింగ్‌డమ్, అమెరికా, న్యూజిలాండ్ సహా అనేక దేశాలతో భారత్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు చేసుకుందన్నారు. ప్రస్తుతం 10 నుండి 12 ఒప్పందాలపై చర్చలు జరుపుతున్నామని, దీని ద్వారా తక్కువ ఖర్చు, అధిక నాణ్యత కలిగిన ఉక్కు అంతర్జాతీయ మార్కెట్లకు అందుబాటులో ఉండేలా చూస్తామని చెప్పారు. భారతదేశ ఉక్కు పరిశ్రమ.. పెరుగుతున్న దేశీయ, అంతర్జాతీయ అవసరాలు తీర్చడానికి సిద్ధంగా ఉందని కేంద్ర మంత్రి ఈ సందర్భంగా తెలియజేస్తూ...

(వాయిస్ 35 సెకన్లు)

=====================

ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పదవిని భారతీయ జనతా పార్టీ కైవసం చేసుకుంది. కొత్త మేయర్‌గా ఆ పార్టీ నేత రాజా ఇక్బాల్ సింగ్ ఎన్నికయ్యారు. ఈరోజు జరిగిన ఎన్నికలలో మొత్తం పోలయిన 142 ఓట్లలో ఆయనకు 133 ఓట్లు రాగా, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి 8 ఓట్లు వచ్చాయి. ఒక ఓటు చెల్లలేదు. కాగా.. ఆమ్ ఆద్మీ పార్టీ ఈ ఎన్నికలను బహిష్కరించింది.

=====================
=====================